# బాబోయ్ బొమ్మలు

**పి.వి.రమణకుమార్**

అప్పటికి ఇరవై ఒకటోసారి తల దువ్వుకుంటున్న విస్సు అనబడే విశ్వనాథ్ తన సెల్లు ఘొల్లుమనడంతో చేతిలో వున్న దువ్వెన్ని ప్యాంట్ బ్యాక్ పాకెట్‌లో కుక్కుకొని షర్టు జేబులో దర్జాగా కొలువుతీరి ప్రతి పది నిముషాల కొకసారి అరచి గోలపెట్టే సెల్లును బైటకు తీసి ఆన్ చేశాడు.

"హలో..విస్సూ! ఎక్కడున్నావ్?" అవతలి వైపు ప్రశ్న.

"హలో కిలికించితా! గుడ్ మార్నింగ్..రూంలోనే వున్నాను. మరో పది నిముషాల్లో స్టూడియో దగ్గరికి వస్తాను" వెలిగిపోతూన్న ముఖంతో చెప్పాడు విస్సు.

"స్టూడియో దగ్గరకు తర్వాత వెళదాం. నువ్వు నేరుగా మెయిన్‌బజార్‌లో ఉన్న ఇంద్రలోక్ హోటల్ దగ్గరకు వచ్చెయ్. అక్కడ నీకోసం వెయిట్ చేస్తుంటాను. అన్నట్లు కెమెరా రెడీ చేసుకొనిరా!" సెల్ ద్వారానే ఆర్డర్ జారీ చేసింది కిలికించిత.

కిలికించిత అంటే ఓ సంచలనం. టీ.వీ.టెన్ రిపోర్టర్‌గా అతి కొద్దికాలంలోనే పాపులారిటీ సంపాదించుకున్న కిలికించిత స్టయిలే వెరయిటీగా ఉంటుంది. చిత్ర, విచిత్రమైన వ్యక్తుల్నీ, వారి వృత్తుల్నీ..సంఘటనల్నీ, సమావేశాల్నీ ఎడాపెడా ఫోకస్ చేసి టీవీ టెన్ ఛానెల్లో ఇమేజ్ సంపాదించింది.

విస్సు టీ.వీ.టెన్‌లో కెమెరామెన్‌గా కిలికించిత కంటే సీనియర్. అయినా ఆమె చెప్పిన చోటుకి చెప్పినట్టు వెళ్ళి వీడియో షూట్ చెయ్యడమే అతని తక్షణ కర్తవ్యం. అలా కాదని బద్ధకించే సాహసం అతనెప్పుడూ చెయ్యలేదు. కిలికించితలో అందం యాభై శాతం వుంటే తెలివితేటలు నూట యాభై శాతం ఉన్నాయని అతను ప్రగాఢంగా నమ్ముతాడు. అతనో మౌన ఆరాధకుడు.

అందుకే తన బ్యాచిలర్ రూమ్‌ని క్లీన్ అండ్ గ్రీన్‌గా సర్దేసి తన ఆయుధమైన కెమెరాను ఒకసారి చెక్ చేసుకుని తన బ్యాగ్‌లో సర్దుకుని, తన ఓల్డ్ బజాజ్ స్కూటర్‌ని బైటకు తీసి వాయువేగంతో ఆ సిటీలోని మెయిన్ బజార్ వైపు సూర్యుడివైపు ఆకాశంలోకి దూసుకుపోయిన హనుమంతుడిలా దూసుకుపోయాడు కెమెరామెన్ విస్సు.

★ ★ ★

ఇంద్రలోక్ హోటల్ ఇంద్రలోకమంత అద్భుతంగా వుండదు కానీ! కాస్తంత మోడరన్‌గా స్వచ్ఛమైన భోజన ఫలహారాలకు వేదికగా ఉంటుంది. రోజూ కాఫీ టిఫెన్ల వంటి కార్యక్రమాలు అక్కడే పూర్తి చేసే టీవీ టెన్ రిపోర్టర్ కిలికించిత రొటీన్‌గా తాను కూర్చునే టేబుల్ దగ్గరే కూర్చొని విస్సు కోసం వెయిట్ చేయసాగింది.

అప్పుడే హోటల్లోకి ఎంటరైన విస్సూ వస్తూనే కిలికించితకు విష్ చేసి గబగబా దువ్వెన తీసి చెదిరిపోయిన క్రాపును దువ్వుకుంటూ ఆమె ఎదురుగా కూర్చున్నాడు. అతని భుజానికి కెమెరాతో ఉన్న బ్యాగు తగిలించుకున్నాడు. అస్తమానం అతనలా దువ్వుకోవడం చూసీ చూసీ విసిగిపోయిన కిలికించిత సీరియస్‌గా "మిష్టర్ విస్సు ఏమిటీ మీరు చేస్తున్నది?" అన్నది.

"టిఫెన్ చేయడానికి కూర్చుంటున్నాను కిలీ.." అన్నాడు.

"షటప్! కాల్ మి మేడమ్" టపాకాయలా పేలింది.

"సా..సారీ మేడమ్" దువ్వెన జేబులో దాచేస్తూ చెప్పాడు.

"మనం డ్యూటీలోకి ఎంటరయ్యాక క్రాపు దువ్వుకోవడం, షర్టు సరి చేసుకోవడంలాంటివి నాకు నచ్చని విషయాలు"

"ఓ.కె. ఇంకెప్పుడూ దువ్వుకోను. జుట్టు చిందర వందర అయ్యి చింపాంజీ జుట్టులా తయారైనా దువ్వుకోనే, దువ్వుకోను." సిన్సియర్‌గా చెబుతూన్న అతని మాటలు విని కిసుక్కున నవ్వబోయి, నవ్వు ఆపుకుని టిఫిన్ ఆర్డర్ చేసింది కిలికించిత.

దూరంగా క్యాష్ కౌంటర్లో నుండి వీళ్ళను చూసి హోటల్ ప్రొప్రయిటర్ గుప్తా పిచ్చి నవ్వొకటి నవ్వి తిరిగి తన పని తాను చూసుకోసాగాడు. అతని పిచ్చి నవ్వు వెనక బైటకు చెప్పుకోలేని బాధవుంది. ఇంద్రలోక్ హోటల్ రుచికీ, శుచికీ పేరుపడటంతో బిజినెస్ బాగానే వున్నా పోలీసులు, హెల్త్ డిపార్టుమెంట్ వాళ్ళు, లేబర్ ఆఫీసువాళ్ళు, సేల్స్‌టాక్స్ వాళ్ళు ఇలా రకరకాల డిపార్టుమెంట్స్ వాళ్ళు వచ్చి అత్తగారింట్లో అల్లుళ్ళలా హాయిగా మెక్కి చక్కగా వెళుతుంటారు. ఇప్పుడు అదనంగా న్యూస్ పేపర్స్ రిపోర్టర్స్, ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్స్ కూడా వచ్చి అన్నగారింట్లో తమ్ముళ్ళలా, చెల్లెళ్ళలా తినేసి హ్యాపీగా వారి వారి పనుల్లోకి వెళ్ళిపోతున్నారు.

అందుకే ఇంద్రలోక్ హోటల్ ప్రొప్రయిటర్ గుప్తా ఇలా వాళ్ళు ఫ్రీగా తినడానికి వచ్చినప్పుడల్లా పిచ్చి నవ్వొకటి నవ్వేసి, బాధను దిగమింగుకొని, తన పని తాను చేసుకోవటం అలవాటు చేసుకున్నాడు.

రెండు రకాల టిఫిన్లు తిని, చిక్కని బ్రూ కాఫీ త్రాగాక-

"చెప్పండి మేడమ్! మన ప్రోగ్రాం ఎక్కడ?" అంటూ ముందుకు వంగి ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు విస్సు.

"మీరు ఇంత దగ్గరగా ముఖంలో ముఖం పెట్టి అడగక్కరలేదు" చెప్పింది.

గతుక్కుమని వెనక్కువాలి- "సారీ" అన్నాడు.

ఆమె సర్దుకుని విషయానికి వస్తూ- "మనమిప్పుడు ఒక అరుదైన వ్యక్తిని ఇంటర్వ్యూ చేయబోతున్నాం" చెప్పింది.

విస్సూ విసుగ్గా ముఖం పెట్టి "మళ్ళీ మనం ప్రేమించినవాళ్ళు పెళ్ళి చేసుకోలేదనో, పెళ్ళి చేసుకున్న పెళ్ళాం కాపురం చేయడం లేదనో, వాటర్ ట్యాంకుల మీదా! కరెంట్ పోల్స్ మీదా ఎక్కిన వాళ్ళనెవరినైనా ఇంటర్వ్యూ చెయ్యాలా మేడమ్?" ప్రశ్నించాడు.

"ముందు విషయం వినకుండా వీరప్రశ్నలు వేయకు" కసిరింది.

'అబ్బా! కోపంలో కూడా గ్లామర్ రైజింగే' అనుకొని "సారీ మేడమ్! మనం ఇంటర్వ్యూ చేయబోయే అరుదైన వ్యక్తి ఎవరో తెలుసుకోవచ్చా?" అడిగాడు.

"వచ్చు. అతని పేరు బోసుబాబు. బొమ్మల కంపెనీ ఓనర్. స్ఫూర్తిదాయకమైన వ్యక్తి" చెప్పి వెంటనే తన సెల్ ద్వారా బోసుబాబుని కాంటాక్ట్ చేసి పర్మిషన్ తీసుకున్నది కిలికించిత. వెంటనే హుషారుగా "లక్కీగా...బొమ్మల కంపెనీ ఓనర్ బోసుబాబు మన ఛానెల్‌కు ఇంటర్వ్యూ ఇవ్వడానికి ఒప్పుకున్నాడు" అన్నది.

"ఎప్పుడూ?"

"ఇప్పుడే కమాన్. లెటజ్ ఫాలో మీ" అంటూనే ఉత్సాహంగా బైటకు నడిచింది. గంధర్వకన్య వెంటపడిన రాకుమారుడిలా, కిలికించిత వెంట బ్యాగ్ తగిలించుకొని నడిచాడు విస్సు.

★ ★ ★

అర్ధగంట స్కూటర్ మీద ప్రయాణం చేసి ఊరికి దూరంగా ఉన్న బోసుబాబు బొమ్మల కంపెనీ దగ్గరకు చేరుకున్నారు. స్కూటర్ స్టాండు వేసి కంపెనీ గేటు వైపు చూశారు. గేటుపైన పెద్ద పెద్ద తాటికాయంత అక్షరాలతో 'బోసుబాబు (దిష్టి) బొమ్మల కంపెనీ' అనే బోర్డు

దర్శనమిచ్చింది. అంతేకాదు ద్వారానికి రెండువైపులా ఒక ఆడదిష్టిబొమ్మ, ఒక మగ దిష్టిబొమ్మ 'వెల్‌కమ్' చెబుతున్నట్లు చేతులు చూపిస్తూ కనిపించేసరికి ఆశ్చర్య పడిపోతూ, సంబరపడిపోయారు.

గేటుదాటి లోపలికి అడుగుపెట్టబోయేంతలో కిలికించిత సెల్లు ఘొల్లుమన్నది. అది తమ బాస్ కాల్‌గా గుర్తించి వెంటనే ఎటెన్షన్‌లోకి వచ్చేస్తూ "నమస్తే నా పేరు కిలికించిత. మీరు చూడాల్సింది టీవీ టెన్. జాగ్రత్తగా చూస్తుండండి. అదేపనిగా చూస్తుండండీ..కెమెరా మెన్ విస్సూతో.." అంటూ గడగడా చెప్పేసింది.

"మిస్ కిలికించితా! మీరిప్పుడు ఎక్కడున్నారు? ఏం చేయబోతున్నారు?" టీవీ టెన్ బాస్ ప్రశ్నించాడు.

"సార్! మేమిప్పుడు ది ఫేమస్ దిష్టి బొమ్మల కంపెనీ ఓనర్ బోసుబాబుగారి కంపెనీలో కాళ్ళు పెట్టబోతున్నాం. మరికొద్దిసేపట్లో బోసుబాబుగారిని ఇంటర్వ్యూ చేయబోతున్నాం" తనదైన బాణీలో టీ.వీ. ఉచ్చారణతో చెప్పింది కిలికించిత.

"ఇట్స్ ఓ.కె.కేరియానో" అంటూ అవతలివైపు లైన్ కట్ అయ్యింది. ఇద్దరూ రిలీఫ్‌గా ఫీలయ్యి, చిన్నగా కంపెనీలోకి ఎంటరయ్యారు. సరిగ్గా వాళ్ళ రాక కోసమే చూస్తున్న నలభై సంవత్సరాల బోసుబాబు వారికి స్వాగతం చెప్పి, మర్యాదగా లోపల వున్న తన ఆఫీస్ రూంలోనికి తీసుకువెళ్ళాడు.

బైట చూడటానికి చాలా చిన్నదిగా ఉన్నా ఆ దిష్టిబొమ్మల కంపెనీ లోపల రిటైల్ కౌంటర్, ఆఫీసుగదీ, వెనుక పెద్ద, పెద్ద షెడ్లు వేయబడి వుంది. ఫార్మాలిటీ ప్రకారం కాఫీ ఫలహారాలు ఏర్పాటు చేశాడు. ఎవరేదిచ్చినా వద్దనే అలవాటులేని విస్సు, కిలికించితా ఆ కార్యక్రమం పూర్తి చేసి, బోసుబాబుతో కలిసి ఆ కంపెనీ అంతా ఒకసారి కలియతిరిగారు. పనిలోపనిగా విస్సు తన కెమెరాకు పని కల్పించాడు.


పెద్ద షెడ్డుల్లో దాదాపు యాభైమంది చిన్నా, పెద్దా ఆడవాళ్ళు దీక్షగా దిష్టిబొమ్మలు తయారు చేస్తూ కనిపించారు. రకరకాల దిష్టిబొమ్మలు చేసీ, చేసీ వాళ్ళ ముఖాలు కూడా దిష్టిబొమ్మల్లా తయారయ్యాయి. వారి ముఖాల్లో టీవీవాళ్ళు వచ్చారన్న ఉబలాటమూ లేదు. ఉత్సాహమూ లేదు. ప్రపంచంలో జనాభా పెరిగిపోతున్నంత వేగంగా దిష్టిబొమ్మలు తయారు చేయటంలో నిమగ్నమైపోయారు.

ఆ కంపెనీ అంతా తిరిగి చూశాక తిరిగి బోసు బాబు పర్సనల్ రూమ్‌లోకి వచ్చేశారు. "వెరీగుడ్ సార్! బోసుబాబుగారూ! ఇక మనం ఇంటర్వ్యూ మొదలుపెడదాం" తానూ స్టడీ అవుతూ చెప్పింది కిలికించిత. బోసుబాబు తన కుర్చీలో నిఠారుగా కూర్చొని, గారపట్టిన పళ్ళను బైటపెట్టి లౌక్యం తెలిసిన దిష్టిబొమ్మలా నవ్వాడు.

"మిష్టర్ విస్సూ రెడీయేనా?" అంటూ విస్సూకేసి చూసింది. విస్సూ దువ్వెనతో తల దువ్వుకుంటూ కనిపించాడు.

"విస్సూ.." అరిచింది.

అదిరిపడిన విస్సూ "యస్ మేడమ్! ఐయామ్ రెడీ" అంటూ మైక్ వైర్ కిలికించితకు అందించి, ఫ్లాష్ లైట్ వేసి కెమెరా ఆన్ చేశాడు.




"నమస్తే! నా పేరు కిలికించిత. మీరు చూడాల్సింది టీ.వీ.టెన్. జాగ్రత్తగా చూడండి. కళ్ళు తెరచి చూస్తూనే వుండండి. మనమిప్పుడు మారుతున్న కాలానికి అవసరమైన ప్రముఖ దిష్టిబొమ్మల కంపెనీ ప్రొప్రయిటర్ బోసుబాబుగారి నుండి కొన్ని వివరాలను అడిగి తెలుసుకుందాం" అంటూ ఎనౌన్స్ చేసి బోసుబాబు వైపు తిరిగింది.

"చూడండి బోసుబాబుగారూ! మీరీ దిష్టిబొమ్మలు తయారీ ఎక్కడ నేర్చుకున్నారు? పెద్ద పరిశ్రమను స్థాపించి ఇంతమందికి ఉపాధి కల్పించాలని ఎందుకు నిర్ణయించుకున్నారు? ముఖ్యంగా ఈ పరిశ్రమలో మహిళలకే పని కల్పించడంలో ఉన్న ఉద్దేశ్యం ఏమిటో

వివరిస్తారా?" అంటూ ప్రశ్నలు గుప్పించి మైక్‌ను బోసు బాబు మౌత్ దగ్గర పెట్టింది కిలికించిత.

బోసుబాబు మళ్ళీ ఒకసారి గారపట్టిన పళ్ళతో దిష్టి బొమ్మలా నవ్వి, రెండు కళ్ళూ మూసి ఒక్కసారి బుర్రలో గతాన్ని గిలకొట్టి, తిరిగి కళ్ళు తెరచి కెమెరా వైపు చూస్తూ చెప్పసాగాడు.

"నేనో పల్లెటూరిలో పుట్టాను. మా నాన్న పాతిక ఎకరాల మాగాణి, నాలుగు ఎకరాల మామిడితోటకు ఆసామి. ఒక్కగానొక్క కొడుకునైన నన్ను గారాబమైన దిష్టిబొమ్మలా పెంచాడు. పనీపాటాలేకా, చదువూ సంధ్యారాకా నేనో జులాయి దిష్టిబొమ్మలా అన్ని రకాల దురలవాట్లకూ అలవాటుపడ్డాను. పెళ్ళి చేస్తే తిక్క కుదురుతుందని అందమైన దిష్టిబొమ్మలాంటి సావిత్రి నిచ్చి పెళ్ళి చేశారు. పెళ్ళయిన వెంట వెంటనే ముగ్గురు ఆడదిష్టి బొమ్మలు సారీ సారీ ఆడపిల్లలు పుట్టారు. అయినా నాలో ఎలాంటి మార్పూ రాలేదు. పేకాటలో వేలకు, వేలు పోగొట్టేవాడిని. ఎకరాలకు ఎకరాలు కోడి పందేల్లో ఓడిపోయేవాడిని. నేను బాగుపడలేదన్న దిగులుతో మా నాన్నపోయాడు. అప్పులవాళ్ళు మా ఆస్తి మొత్తం స్వాధీనం చేసుకున్నారు. మా అమ్మ మంచాన పడి 'హరిలో రంగ హరీ' అంటూ కన్ను మూసింది."

"అయ్యో పాపం..ప్చ్" మధ్యలో మైక్ ద్వారా కిలికించిత జాలి చూపించింది. తిరిగి బోసుబాబు చెప్పసాగాడు.

"అలా అన్నీ కోల్పోయిన నేను దివాళా తీసిన దిష్టిబొమ్మలా మిగిలిపోయాను. ఒక పక్క పెద్ద సంసారం, రాబడి లేదు. ఖర్చులు ఎక్కువ. ఉరి వేసుకుని ప్రత్తిరెతులా వేలాడే దిష్టిబొమ్మనవుదా మనుకున్నా. అలా ఒక రాత్రంతా శోకించాను. ఆ శోకంలో ఒక శ్లోకం పుట్టింది"

"ఏమిటది?"

"గుర్తులేదు. చావకు. బ్రతుకు,బ్రతికించు అన్నది దాని సారాంశం. అప్పుడు తట్టిందీ ఉపాయం. వెంటనే నా కుటుంబాన్ని పల్లెనుండి ఈ పట్టణానికి చేర్చాను. మా పొలాల్లో పైరుపైన పిట్టలు వాలకుండా, పంట చేలకు దిష్టి తగులకుండా చక్కని, అందమైన దిష్టిబొమ్మలు తయారుచేసేవాడిని."


"ఓహో అదన్న మాట మీ వ్యాపార రహస్యం!"

"అవును. అదే నా పాలిట కల్పవృక్షమైన దిష్టిబొమ్మ కథ. వెంటనే నా భార్య తాళిబొట్టు అమ్మి ఆ కొద్దిపాటి డబ్బుతో పాతబట్టలు, ఎండుగడ్డి, వెదురుబొంగులు, బొగ్గుముక్కలు, రంగుడబ్బాలు కొని రకరకాల దిష్టిబొమ్మలు తయారుచేయడం మొదలుపెట్టాను. మొదట నేను, నా భార్య, నా ముగ్గురు పిల్లలూ కలిసి తయారుచేసి అమ్మేవాళ్ళం. చూస్తుండగానే వ్యాపారం పెరిగిపోయింది. ప్రస్తుత ప్రపంచంలో దిష్టిబొమ్మలు తగలెయ్యని రోజంటూ లేదు. ఈమధ్యనే ఈ కంపెనీని బాగా విస్తరింపజేసి, విస్తృతంగా దిష్టిబొమ్మల ఉత్పత్తి పెంచాను" చెప్పటం ఆపి ఆయాసం తీర్చుకోసాగాడు. ఇంతలో ఎవరో దిష్టి బొమ్మకోసం వచ్చారు. బోసుబాబు బిజినెస్ పనిమీద ముందు గదిలోకి వెళ్ళాడు. కిలికించిత ఒక చిన్న షార్ట్ బ్రేక్ ఎనౌన్స్ చేసింది. అలసిపోయిన విస్సూ కెమెరా లోంచి కన్ను బైటకు తీసి, జేబులోంచి దువ్వెన బైటకు తీసి, కిలికించిత అందాన్ని చూస్తూ తన్మయత్వంగా తల దువ్వుకోసాగాడు.

బోసుబాబు దిష్టిబొమ్మ అమ్ముకుని వచ్చేలోగా కిలికించిత, విస్సూ బిస్కెట్లు తిని, టీ త్రాగటం పూర్తి చేశారు. తిరిగి ఇంటర్వ్యూ ప్రారంభమైంది. బోసుబాబు తిరిగి తనదైన స్టయిల్లో చెప్పసాగాడు. "మొదటి నుండీ మా ఇంట్లో ఆడపిల్లలతో దిష్టిబొమ్మలు తయారు చేయించడం అలవాటు కావడంతో ఈ పనిలోకి ఆడవాళ్ళయితేనే అందమైన దిష్టిబొమ్మలు అలుపూసొలుపూ లేకుండా తయారుచేయగలరని భావించి కొంతమంది ఆడవాళ్ళకు రోజువారీ కూలీ ఇచ్చి పరిశ్రమను నిర్వహిస్తున్నాను"

"ఇక దిష్టిబొమ్మల డిమాండు. అమ్మకాల వివరాలు తెలియచేస్తారా?" అడిగింది.

"తప్పకుండా! ఎందుకంటే భావి పారిశ్రామిక వేత్తలకు ఇది ఎంతో ఉపయోగం కూడా! పూర్వం బిల్డింగులు కట్టేటప్పుడు దిష్టి తగలకుండా పెట్టేవారు. ఇప్పుడు అంతకన్నా ఎక్కువగా తగలెయ్యడానికి ఎక్కువ దిష్టిబొమ్మలు కావాల్సిన డిమాండ్ ఏర్పడింది. ఒక్కో దిష్టిబొమ్మా మూడు వందల రూపాయల నుండి మూడు వేల రూపాయలవరకూ ఉంటుంది. ఇందులో పొలిటికల్ దిష్టిబొమ్మలకూ సినీస్టార్ల దిష్టిబొమ్మలకు, అలాగే క్రికెట్‌స్టార్ల దిష్టిబొమ్మలకూ భలే గిరాకీ వుంది. వీటిని ప్రత్యేకంగా మంచి డ్రస్సులు వేసి, సెంటుపూసి, రంగులు అద్ది తయారుచేస్తుంటాం. ఈమధ్య ఇద్దరు సినీస్టార్ల అభిమానులు పోటీపడి, అధిక మొత్తాలిచ్చి దిష్టిబొమ్మలను కొనుక్కు వెళ్ళి, బొమ్మలు దగ్ధం చేసిన ఆనందంలో ఒళ్ళు కాల్చుకున్నారు. వరల్డ్ కప్ నుండి ముఖాలు వ్రేలాడేసుకు వచ్చిన క్రికెట్ స్టార్స్ దిష్టిబొమ్మలు విపరీతంగా కొనుక్కు వెళ్ళి దగ్ధం చేసి కసి తీర్చుకున్నారు. అభిమానులు ఆ మధ్య అర్జెంటుగా ఒక పార్టీ వారు పాతిక దిష్టిబొమ్మలు ఆర్డరిచ్చి తయారుచేయించి, ప్రత్యేక విమానంలో ఢిల్లీ తీసుకుపోయారు"




"వావ్.." అరచింది.

"అవునమ్మా! ఒక్కమాటలో చెప్పాలంటే ఇది దిష్టిబొమ్మలు దగ్ధం చేసే కాలం. ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్క దిష్టిబొమ్మనైనా దగ్ధం చేయనిదే జీవితం ధన్యం కాదమ్మా. ఈమధ్య పదిమంది స్కూలు పిల్లలు వచ్చి పద్యాలు చెప్పి ప్రాణాలు తోడేస్తున్న తెలుగు మాస్టారి గారి దిష్టిబొమ్మను చందాలు వేసుకుని కొనుక్కువెళ్ళి ఆయన ఇంటిముందే దహనం చేశారు. ఇలా ఎన్నో రంగాలలో ఉన్నవాళ్ళ దిష్టిబొమ్మలు వెరయిటీగా తయారుచేయించాల్సిన అవసరం ఎంతయినా వుంది" అంటూ చెప్పుకుపోతున్న బోసుబాబు ఉపన్యాసానికి బ్రేకువేస్తూ బైట కుర్రవాళ్ళు దిష్టిబొమ్మ కావాలంటూ కేకలు వేయసాగారు.

చిన్న బ్రేక్ రావడంతో విస్సు, కిలికించితా రిలాక్స వసాగారు. బైట సేల్సు కౌంటర్‌కు వెళ్ళిన బోసుబాబు పరుగు, పరుగున లోపలకు వచ్చి, "మీ దిష్టి బొమ్మలకూ టైమొచ్చింది. అర్జెంటుగా దొడ్డిదారిన పారిపోండి" అన్నాడు.

"బోసుబాబుగారూ! ఏమయ్యింది? ఎందుకింత హడావుడి?" ఆదుర్దాగా అడిగింది కిలికించిత.

"మీరు మొన్న ఫలానా హీరో ఫాన్స్‌వాళ్ళు దహనం చేసిన దిష్టిబొమ్మల కార్యక్రమాన్ని మీ టీవీ ఛెన్‌లో సరిగా చూపించలేదట. మీ పక్షపాత ధోరణికి నిరసనగా మీ దిష్టిబొమ్మలు తీసుకెళ్ళి మీ స్టూడియో ముందు దహనం చేయాలని ఆవేశంగా వచ్చారు. ఈ పరిస్థితుల్లో వాళ్ళ కంటబడితే ఇక వాళ్ళు దిష్టిబొమ్మలు కొనరు. మీ స్కూటర్‌ని తర్వాత మీ స్టూడియోకు పంపిస్తాను. ఇటు వైపువున్న దొడ్డిదారిగుండా పారిపోండి" పరిస్థితి అంచనా వేస్తూ చెప్పాడు బోసుబాబు.

తారెత్తి పోయిన కిలికించిత, విస్సూ పారిపోయి అటుగా వస్తున్న ఖాళీ ఆటో ఎక్కి భయంతో వణికిపోసాగారు.

ఆటో వాయువేగంతో దూసుకుపోతున్నది.

"ఈ పరిస్థితుల్లో స్టూడియోకు వద్దు, ఎక్కడైనా దాక్కుందాం".

"అయితే నా రూమ్‌కు పోదాం" చెప్పాడు.

"ఎక్కడో అక్కడ ఈరోజుకి దాక్కోవాలి" చెప్పింది.

"హలో కిలికించితా ఎక్కడున్నావ్?" బాస్ సెల్లు ద్వారా అడిగాడు.

"నమస్తే! నా పేరు దిష్టిబొమ్మ! కెమెరా మెన్ దిష్టిబొమ్మతో..." అయోమయంగా చెప్పసాగింది కిలికించిత.

విస్సూ బాధగా తలదువ్వుకోసాగాడు.